క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలి



మాట్లాడుతున్న సభ్యులు

గుంతకల్లు రూరల్: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని ఎన్నికల నిఘా వేదిక గుంతకల్లు నియోజకవర్గం కన్వీనర్ డాక్టర్ హరిప్రసాద్ యాదవ్ సూచించారు. ఆదివారం పట్టణంలో ఎన్నికల నిఘా వేదిక ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా హైకోర్టు అడ్వకేట్ కోరీ చంద్రశేఖర్, భారత రాజ్యాంగ అవగాహన వేదిక అధ్యక్షుడు ఏ.చంద్రశేఖర్, కార్యదర్శి జింకల వేణుగోపాల్ తదితరులు మాట్లాడారు. 2024 జనవరి నాటికి 18 సంవత్సరాలు నిండనున్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేయించుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రజా సంక్షేమం కోసం పాటుపడే నాయకులను గుర్తించి వారికే ఓటు వేయాలని సూచించారు.

ప్రధానోపాధ్యాయుల సంఘం కౌన్సిలర్‌గా మల్లికార్జున



గుంతకల్లు రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం కౌన్సిలర్‌గా పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు ఉద్దల మల్లికార్జున ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయ భవన్‌లో అనంతపురం జిల్లా శాఖ ఎన్నికలను నిర్వహించారు. ఇందులో పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు మల్లికార్జున ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. మల్లికార్జున ఇటీవల ఎంఈఓగా పదోన్నతి పొంది ప్రస్తుతం బొమ్మనహాల్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు.

రాయితీతో గడ్డి కోసే యంత్రాలు

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు రాయితీతో గడ్డి కోసే యంత్రాలను అందిస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రత్నకుమార్ తెలిపారు. చాఫ్ కట్టర్స్ 2 హెచ్‌పీ పవర్ బ్లేడ్‌తో ఉన్న యంత్రం పూర్తి ధర రూ.33,972 ఉండగా సబ్సిడీ రూ.13,588 ప్రభుత్వం భరిస్తుందన్నారు. రైతు వాటాగా రూ.20,382 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ యంత్రం ద్వారా గడ్డిని చిన్న ముక్కలుగా కత్తిరించి పశువులకు వేసినట్లతే 40 శాతం పశుగ్రాస వృథాను అరికట్టవచ్చన్నారు. వివరాలకు 9440126869 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

సాకే భారతికి సత్కారం



సాకే భారతిని సత్కరిస్తున్న వెస్ట్ నరసాపురం గ్రామస్తులు

శింగనమల: ఎస్కే యూనివర్సిటీలో పీహెచ్‌డీ పొందిన సాకే భారతిని వెస్ట్ నరసాపురం పంచాయతీ ప్రజలు ఆదివారం సన్మానించడంతో పాటు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నగేష్, సచివాలయ కన్వీనర్ డి.మల్లికార్జునరెడ్డి, సచివాలయ కన్వీనర్ భాస్కర్ నాయక్, స్కూల్ చైర్మన్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ అసోసియేషన్ తాలూకా కమిటీ ఎన్నిక

గుత్తి: పట్టణంలోని రవి తేజ హోటల్‌లో ఆదివారం రెగ్యులర్ ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గుత్తి తాలూకా సమావేశం జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, జిల్లా అధ్యక్షుడు మస్తానయ్య, ఉపాధ్యక్షులు వైడి వర్మ ఆధ్వర్యంలో తాలూకా కమిటీ అధ్యక్షుడిగా వి. నాగేంద్ర, కార్యదర్శిగా నాగమల్లారెడ్డి, కోశాధికారిగా పీవీ రవి కుమార్, ఉపాధ్యక్షులుగా టి. శ్రీనివాసులు(పామిడి), రవికుమార్(పెద్దవడుగూరు), శ్రీనివాసులు(గుత్తి), సహాయ కార్యదర్శులుగా వెంకటరమణ, వలి, రంగా యాదవ్, ఈసీ మెంబర్స్‌గా అంజినాయక్, కుళ్లాయప్ప, ఓబులప్ప యాదవ్, శ్రీదేవిని ఎన్నుకున్నారు.

వడ్డెర ఓబన్న సంఘం మండల కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న వడ్డెర సంఘం నాయకులు

యాడికి: మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో ఆదివారం వడ్డెర ఓబన్న సంఘం మండల కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా రామాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా నాగార్జున, గౌరవాధ్యక్షుడిగా వెంకటరమణ, సభ్యులుగా శివ, కంబగిరి రాముడు, నాగేంద్ర, ఆది, యుగంధర, రమేష్, వీరాంజి, ప్రవీణ్‌కుమార్, రాంబాబు, సురేష్, సుధాకర్, భాస్కర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కుల పెద్దలు శంకర్, శ్రీనివాసులు, రాముడు, జనార్దన్ తెలిపారు. వడ్డెర్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ తెలిపారు.

దేవరపల్లి పీర్లచావిడికి రోడ్డు



అధ్వానంగా ఉన్న పీర్లచావిడి రోడ్డు



దేవరపల్లిలో పీర్లచావిడికి రోడ్డు వేసిన దృశ్యం

పామిడి: మొహర్రం పండుగను పురస్కరించుకొని పీర్లచావిడికి సీసీ రోడ్డు వేయిస్తానని గుంతకల్లు ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి హామీ ఇచ్చారు. హామీ ఇచ్చిన 10 రోజుల్లోనే దేవరపల్లి గ్రామ పీర్లచావిడికి ఎమ్మెల్యే చొరవతో సీసీరోడ్డు నిర్మించారు. మండలగ్రాంటు రూ.2.50 లక్షలతో వైస్ ఎంపీపీ నక్కా సౌభాగ్య ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు నక్కా ఓబులేసు దగ్గరుండి రోడ్డు వేయించారు. ఈఓఆర్డీ బీవీ శశికళ పర్యవేక్షణలో పంచాయతీ కార్మికులతో గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. పీర్లచావిడి రోడ్డు వేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి



మాట్లాడుతున్న సీఐ ఉమామహేశ్వరరెడ్డి

గుంతకల్లు రూరల్: మొహర్రంను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రూరల్ సీఐ ఉమామహేశ్వరరెడ్డి సూచించారు. రూరల్, కసాపురం పోలీస్ స్టేషన్ల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలతో ఆదివారం సాయంత్రం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. రూరల్, కసాపురం ఎస్‌ఐలు సురేష్, గోపాలుడుతో కలిసి సీఐ ఉమామహేశ్వరరెడ్డి ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. మొహర్రంతోపాటు, రానున్న వినాయక చవితి వేడుకలను సైతం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జరుపుకోవాలని సూచించారు. అనవసరమైన గొడవలు, అల్లర్లకు పాల్పడితే సంబంధిత గ్రామాల్లో పండుగల నిర్వహణకు అనుమతిని రద్దు చేస్తామని హెచ్చరించారు.

యల్లనూరు: మండలవ్యాప్తంగా అనుమతులు తీసుకున్న గ్రామాల్లో పీర్ల పండుగ(మొహర్రం) ప్రశాంతంగా జరుపుకోవాలని ఆదివారం ఎస్‌ఐ రామకృష్ణ సూచించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎక్కడైనా గొడవలు సృష్టించినా, మద్యం సేవించి ఘర్షణలకు దిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీర్ల పండుగను అందరూ ఐకమత్యంతో కలిసి మెలసి జరుపుకోవాలని సూచించారు.

పెద్దవడుగూరు : మొహర్రం వేడుకల నిర్వహణకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని యాడికి రూరల్ సీఐ శంకర్‌రెడ్డి, పెద్దవడుగూరు ఎస్‌ఐ శ్రీనివాసులు కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ మొహర్రం సమయంలో ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించబోమన్నారు.

శింగనమల: మొహర్రం సందర్భంగా గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని శింగనమల, గార్లదిన్నె ఎస్‌ఐలు బాలకృష్ణయ్య, సాగర్ హెచ్చరించారు. ఆదివారం గురుగుంట్లలో వారు గ్రామస్తులతో మాట్లాడారు. గతేడాది శింగనమల నుంచి గురుగుంట్లకు పీర్లు తీసుకుపోయే సమయంలో ఘర్షణ జరిగిందని, ఇప్పుడు కూడా ఘర్షణ పడితే , ఇక ఇప్పటికీ మొహర్రం జరుపుకోవడానికి అనుమతి ఇవ్వమన్నారు. ఏఎస్‌ఐ చితంబరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రామసుబ్బయ్య

గుంతకల్లుటౌన్: మోటార్‌సైకిల్‌ను నడిపే ప్రతి వ్యక్తి తలకు హెల్మెట్‌ను ధరించి గమ్యానికి సురక్షితంగా చేరుకోవాలని వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య సూచించారు. ఆదివారం సాయంత్రం మెయిన్‌రోడ్డులోని ప్రధాన కూడళ్లలో ద్విచక్ర వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్ వాడకాన్ని బాధ్యతగా తీసుకున్నప్పుడే రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గించవచ్చని చెప్పారు. మోటార్ వాహన చట్టం ప్రకారం వాహనాన్ని నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలన్నారు. మైనర్ బాలలకు ద్విచక్రవాహనాలను ఇచ్చి రోడ్ల పైకి పంపవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

3 నుంచి మహాకుంభాభిషేక మహోత్సవాలు



కరపత్రాలు విడుదల చేస్తున్న ఆలయ చైర్మన్ వెంకటరెడ్డి,తదితరులు

గుంతకల్లుటౌన్: పాతగుంతకల్లులో ప్రసిద్ధి చెందిన రామలింగేశ్వర స్వామి ఆలయ రాజగోపుర, మహాకుంభాభిషేకం ఉత్సవాలు సెప్టెంబర్ 3 నుంచి 6వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఎం.వెంకటరెడ్డి తెలిపారు. ఆదివారం ఆలయ ఆవరణలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆలయ కమిటీ సభ్యులు విడుదల చేశారు. వచ్చే నెల 6న ఆలయ రాజగోపురాన్ని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ప్రారంభించనున్నట్లు వెంకటరెడ్డి తెలియజేశారు. మూడురోజుల పాటు పలువురు పీఠాధిపతులు, వేదపండితుల ఆధ్వర్యంలో జరిగే పూజా కార్యక్రమాల్లో భక్తాదులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆలయ అర్చకుడు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ ఎంపీటీసీ సభ్యుడి మృతి



భాస్కర్(ఫైల్)

యాడికి: గుండెపోటుతో మండల పరిధిలోని భోగాలకట్టకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు బోయ భాస్కర్(49) మృతి చెందాడు. వివరాలు.. గ్రామ సమీపంలోని మైనింగ్‌లో లేబర్‌గా పని చేస్తున్న భాస్కర్ ఆదివారం సాయంత్రం ఇంటి సమీపంలోనే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు 108 ద్వారా రాయల చెరువుకు తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, నగరూరు సర్పంచు రుక్మాందర రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బ్రహ్మానందరెడ్డి, నాగేంద్రరెడ్డి, హనుమంత రెడ్డి, ఆదినారాయణరెడ్డి తదితరులు భాస్కర్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గుత్తి రూరల్: రజాపురం గ్రామ సమీపంలో 67వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విష్ణువర్ధన్(26) అనే యువకుడు అనంతపురంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు..కావేటి సముద్రంకు చెందిన విష్ణువర్ధన్, తాడిపత్రికి చెందిన మస్తాన్, వారి స్నేహితులు నాగార్జున సుబ్రహ్మణ్యంతో కలిసి రెండు బైకులపై కసాపురం వెళ్తుండగా రజాపురం గురుకుల పాఠశాల వద్ద రోడ్డు డైవర్షన్ కోసం వేసిన మట్టి దిమ్మెను ఢీకొన్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన విష్ణువర్ధన్, మస్తాన్‌ను గుత్తి ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో ఆదివారం మృతి చెందాడు. విష్ణువర్ధన్ మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వర్షం కోసం బోనాలు



భైరవస్వామికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

పుట్లూరు: వర్షాలు కురవాలని కోరుతూ ఆదివారం మండలంలోని చింతకుంట గ్రామంలో భైరవస్వామికి మహిళలు బోనాలు సమర్పించారు. అదను దాటుతున్నా పదును కాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్వామికి పూజలు నిర్వహించి, బొడ్రాయికి 101 బిందెలతో జలాభిషేకం చేశారు.

యువకుల ఘర్షణ



ఘర్షణ పడుతున్న యువకులు

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో యువకుల మధ్య ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కోట వీధిలో ఆదివారం సాయంత్రం బారే హిమామ్ పీర్ల పెట్టే ఊరేగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యువకులు రెండు గ్రూపులుగా విడిపోయి పరస్పరం దాడులు చేసుకున్నారు.రాళ్లతో పరస్పరం దాడి చేసుకోవడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గుంపులో ఒక యువకున్ని మరొక యువకుడు తగిలాడనే నెపంతో పరస్పరం దాడులు చేసుకున్నట్లు తెలుస్తోంది.

బాలుడికి ఆర్థిక సాయం

తాడిపత్రి అర్బన్: బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతున్న ఓ బాలుడికి ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆర్థిక సాయం చేసింది. వివరాల్లోకి వెళితే...పెద్దవడగూరు మండలం విరుపాపురం గ్రామానికి చెందిన నరసింహ, నాగేశ్వరీ దంపతుల కుమారుడు దేవనరసింహ(17) ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కర్నూలులోని ఓ ఆసుపత్రిలో చేర్చారు. వారి ఆర్థిక పరిస్థితిని గమనించిన ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ప్రతినిధులు బాలుడి తల్లిదండ్రులకు ఆదివారం స్థానిక వివేకానంద స్కూల్‌లో రూ.10,300 నగదును అందజేశారు. సంస్థ అధ్యక్షుడు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి శంకర్, కన్వీనర్ శ్రీరంగయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, నాగభూషణ్, రామాంజినేయులు, పుల్లారెడ్డి, కుమారస్వామి, ఓబులేసు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



గుత్తిఅనంతపురం సమీపంలోని వంక నుంచి ఇసుక తరలిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: గుత్తిఅనంతపురం, విరుపాపురం మధ్యలోని పెద్ద వంక నుంచి కొందరు అక్రమంగా ఇసుక తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. గుత్తి మండలం కొత్తపేట కు చెందిన కొందరు వ్యక్తులు గుంపు గా ఏర్పడి రహస్యంగా గుంతకల్లు, డోన్, ప్యాపిలి తదితర ప్రాంతాలకు తరలిస్తూ లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టినా ఫలితం లేకుండా పోయింది. మండలంలోని కొందరు లబ్ధిదారులు ఇంటి నిర్మాణం కోసం ఇసుక తోలుకుంటే అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలని భయపెడతారని, అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై ఎవరూ చర్యలు తీసుకోరా అంటూ ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఇసుక కిందభాగంలో నింపి దానిపై కొంత వరకు మట్టిని వేసుకొని వెళ్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా పీర్ల పెట్టె గ్రామోత్సవం





చందనలో పీర్ల పెట్టెకు వారపడిన భక్తులు, గుత్తిలో బారే హిమామ్ పీర్ల పెట్టెను ఊరేగిస్తున్న దృశ్యం

యాడికి: చందన గ్రామంలో పీర్లపెట్టె గ్రామోత్సవాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పీర్ల మకాన్‌లో భద్రపరచిన పీర్ల పెట్టెను గ్రామ పెద్దల సమక్షంలో కిందికి దించారు. ముజావర్లు ఖాజాహుసేన్, చాంద్‌బాషా ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం మకాన్ వద్ద నున్న పీర్ల పెట్టెను ముజావర్ దర్గాకు తీసుకొచ్చిన అనంతరం పీర్ల పెట్టెను రంగురంగుల పూలు, పాగాలతో అలంకరించారు. దర్గాలో ప్రత్యేక ఫాతేహా నిర్వహించి రాత్రి 10 గంటలకు ముజావర్లు పీర్ల పెట్టెను దర్గా నుంచి మకాన్ వద్దకు ప్రత్యేక డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. అనారోగ్యానికి గురైన వారు, సంతానం లేనివారు, పీర్ల పెట్టె ముందు పడుకున్నారు. పీర్ల పెట్టెను ఎత్తుకున్న ముజావర్ దాటితే కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. అనంతరం మకాన్ ఎదురుగా ఉన్న అగ్గి గుండాన్ని యువకులు పారలతో తవ్వారు. మకాన్‌లో ముజావర్లు పెద్దపీరు స్వామి, చిన్న పీరుస్వామి, బొడ్డుపీరు స్వాములతో పాటు మరో 10 వివిధ రకాల పీర్ల స్వాముల ప్రథమ దర్శనాన్ని భక్తులకు కల్పించారు. పీర్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా 26న చిన్న సరిగెత్తు, 27న విడిదినం, 28న పెద్ద సరిగెత్తు, 29న పీర్ల జలది నిర్వహిస్తున్నట్లు ముజావర్లు తెలిపారు.

గుత్తి: పట్టణంలో ఆదివారం సాయంత్రం బారే హిమామ్ పీర్ల పెట్టెను ఘనంగా ఊరేగించారు. కోట వీధి నుంచి వాసవీ బజారులో ఉన్న బారే హిమామ్ పీర్ల మకాన్ వరకు ఊరేగింపు సాగింది. పెద్ద ఎత్తున భక్తులు, ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పీరాతో పాటు ఆయా పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైల్వే ఉద్యోగికి గాయాలు



గాయపడిన రాము

గార్లదిన్నె: బూదేడులో ఆదివారం విద్యుదాఘాతంతో ఓ రైల్వే ఉద్యోగికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రాము అనే వ్యక్తి కల్లూరులో రైల్వే స్టేషన్‌లో పంచ్‌మ్యాన్‌గా పనిచేసేవాడు. తోటలో విద్యుత్ మోటర్ ఆన్ చేయడానికి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజ్ వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. గాయపడిన అతడిని స్థానికులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

యాడికి: మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డులో ఆదివారం పేకాట స్థావరంపై ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి సిబ్బందితో దాడి చేశారు. ఈసందర్భంగా 9 మందిని పట్టుకొని వారి నుంచి రూ.10,150 నగదు, 3 బైకులు, 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నాడు.

విస్తృతంగా ఖుదాదాద్ ఫౌండేషన్ సేవలు



మాట్లాడుతున్న ఫయాజ్‌బాషా

తాడిపత్రి అర్బన్: సూఫీ ఖుదాదాద్ వెల్ఫేర్ ఫౌండేషన్ సేవలు విస్తృతంగా చేయాలని వైఎస్సార్ సీపీ నేత ఫయాజ్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం కొండాపురం గ్రామ సమీపంలోని దర్గాలో ఆదివారం సూఫీ ఖుదాదాద్ వెల్ఫేర్ ఫౌండేషన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ట్రస్టును ప్రారంభించడం గొప్ప కాదని, ట్రస్టు ద్వారా అర్హులకు సేవలందించినప్పుడే సార్థకత ఉంటుందన్నారు. కార్యక్రమంలో దర్గా పీఠాధిపతులు, ముతవల్లిలు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు

'గడప గడపకూ మన ప్రభుత్వం'

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని సచివాలయం -1పరిధిలో సోమవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

'స్పందన'

బుక్కరాయసముద్రం: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల తహసీల్దార్ రమాదేవి తెలిపారు. మండల ప్రజలు సమస్యలు ఉన్నట్లు అయితే అర్జీల రూపంలో ఇవ్వాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

యల్లనూరు: తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి అధికారులు హాజరుకావాలని తహసీల్దారు సుమతి కోరారు. ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే అర్జీల రూపంలో ఇవ్వాలని సూచించారు.

చైతన్య మండల సమాఖ్య వార్షిక సభ

బుక్కరాయసముద్రం: వైకేపీ కార్యాలయంలో సోమవారం శ్రీ చైతన్య మండల సమాఖ్య వార్షిక మహాసభ నిర్వహిస్తున్నట్లు వైకేపీ ఏపీఎం మద్దిలేటి తెలిపారు. సమావేశానికి మండల సమాఖ్య ప్రతినిధులు, సభ్యులు హాజరుకావాలని కోరారు.

వాహనాల వేలం

గార్లదిన్నె: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 18 బైకులు, ఒకఆటో సోమవారం వేలం వేస్తున్నట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు. ఆసక్తి గలవారు రూ.5 వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

రిజర్వేషన్ సాధనకు సంఘటిత పోరాటం



మాట్లాడుతున్న సదానంద గౌడ్

గుంతకల్లుటౌన్: వీరశైవ లింగాయత్, లింగ బలిజ కులస్తులను ఓబీసీలో చేర్చేవరకు కేంద్ర ప్రభుత్వంపై సంఘటిత పోరాటానికి కులస్తులంతా సిద్ధంకావాలని అఖిలభారత వీరశైవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు సదానందగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం పాతగుంతకల్లులోని జగద్గురు మఠంలో కులపెద్దల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరశైవలింగాయత్, లింగ బలిజలను కేంద్రం ఓబీసీలో చేర్చకపోవడంతో నీట్, ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, సీఈటీ తదితర వాటిలో తమ పిల్లలు వెనుకబడి పోతున్నారన్నారు. తమను ఓబీసీలో చేర్చే విధంగా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఓబీసీ రిజర్వేషన్ కల్పించేందుకు త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఓబీసీ సాధన సమితి ఏర్పాటు చేసి ఉద్యమాలకు శ్రీకారం చుడతామని చెప్పారు. లింగాయత్ సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నటరాజ్, మోహన్‌బాబు, కోశాధికారి సురేష్‌గౌడ్, రాష్ట్ర మహాసభ కార్యవర్గ సభ్యులు జగదీష్, శివకుమార్, ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లా నాయకులు శంకర్, నాగార్జున, వీరప్ప, వీరభద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు సన్మానం

గుత్తి: ఒంటరిగా ఉన్న అమ్మాయి సమాచారాన్ని పోలీసులకు ఇచ్చి ఆ అమ్మాయి ని కాపాడిన గుత్తి ఆర్ఎస్‌కు చెందిన ఆటో డ్రైవర్ మురళి ఆచారిని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు శనివారం రాత్రి అభినందించడంతోపాటు రివార్డును అందిచారు. ఆదివారం గుత్తి ఆర్ఎస్‌లోని ఆటో స్టాండ్‌లో గుత్తి మండల ఆటో డ్రైవర్ల అధ్యక్షుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో మురళి ఆచారిని శాలువాలు, పూల మాలలతో సత్కరించారు.

వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శికి సన్మానం

గుత్తి: పట్టణంలోని ఎంఎస్ క్రీడామైదానంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఇటీవల వైఎస్సార్ టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన శ్రీధర్‌గౌడ్‌ను వాకర్స్ అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. నాయకులు శివ శంకర్, శివ, రవి, డేవిడ్, సత్య, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

గుత్తి: పట్టణ శివారులోని అమోఘ్ డాబా వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..తురకపల్లికి చెందిన నారాయణ బైక్‌పై వస్తుండగా గుత్తి నుంచి అనంతపురం వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని 108లో గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు అనంతపురం రెఫర్ చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అలరించిన నిర్విరామ సంగీత కచేరి

అనంతపురం కల్చరల్: నగరం అయ్యప్ప భక్తిగీతాలతో మార్మోగింది. 12 గంటల నిర్విరామ సంగీత కచేరీ అందరినీ భక్తిభావంలో ముంచెత్తింది. 'నీ నామమే నా ప్రాణం' పేరిట అయ్యప్ప స్వామి అఖండ సంకీర్తన ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు కొనసాగింది. అనంతరం పాతూరులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో రంగాచారి గురుస్వామి నేతృత్వంలో అయ్యప్ప గురుస్వాముల సమావేశం జరిగింది. అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి అధ్యక్షుడు దేశ్పాండే గురుస్వామితో పాటు తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఈశ్వరదేవి పీఠాధిపతులు శివకుమారస్వామి, వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞాన ప్రచారకులు శ్రీకృష్ణమాచార్యులు, డాక్టర్ చంద్రమౌళి గురుస్వామి, శంకర్, శ్రీరమణ ప్రసంగించారు. నిర్వాహకులు న్యాయవాది గురుప్రసాద్, వైఎస్ ప్రకాష్ ఆచారి పాల్గొన్నారు.